క్లుప్తంగా

నేడు సర్వసభ్య సమావేశం

కలసపాడు : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10–30 గంటలకు ఎంపీపీ బోదనబోయిన నిర్మలదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మహబూబ్‌బీ తెలిపారు. సమావేశంలో పారిశుద్ధ్యం, విద్య, వైద్యం, ఉపాధి, విద్యుత్ తదితర అంశాలపై చర్చ ఉంటుందన్నారు. ఈ సమావేశానికి జెడ్పీటీసీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అన్నిశాఖల అధికారులు తప్పక హాజరు కావాలని ఆమె కోరారు.

శ్రీ కనక మహాలక్ష్మికి పూజలు



కనక మహాలక్ష్మి పూజలో పాల్గొన్న మహిళలు

పోరుమామిళ్ల: పట్టణంలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో గురువారం రాత్రి శ్రీ కనకమహాలక్ష్మికి పూజ నిర్వహించారు. పూజలు చేయడం వలన ఆయురారోగ్య, ఐశ్వర్యం చేకూరుతుందని వేదపండితులు పేర్కొన్నారు. మహిళలు, ఆర్యవైశ్య సంఘ అధ్యక్ష, కార్యదర్శులు విశ్వనాథుల ప్రసాద్, సుబ్రమణ్యం, ఉపాధ్యక్షుడు తులసి సుధాకర్, సత్యనారాయణ, సుధీర్ పూజలు చేశారు.

కంపచెట్లు తొలగింపు




కూలూరు- కొట్టాల నుంచి చాగలమర్రికి వెళ్లే రహదారిలో కంపచెట్లను తొలగించిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

రాజుపాళెం : మండలంలోని కూలూరు–కొట్టాల గ్రామాల మధ్యలో నంద్యాల జిల్లా చాగలమర్రికి వెళ్లే రహదారిలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న కంపచెట్లను గురువారం తొలగించారు. 'కంపచెట్లను తొలగించండి సారూ' అనే వార్త మంగళవారం సాక్షిలో ప్రచురితమైంది. దీంతో రాజుపాళెం మండల ఆర్‌అండ్‌బీ ఏఈ సరోజినీ దీక్షిత్ స్పందించి రోడ్డుకిరువైపులా దాదాపు 5 కిలోమీటర్ల మేర ఉన్న కంపచెట్లను జేసీబీ సహాయంతో తొలగించారు. దీంతో ఆ దారిలో వెళ్లే వాహనదారులు సాక్షికి ధన్యవాదాలు తెలిపారు.

పడిపూజ



అయ్యప్ప విగ్రహానికి అభిషేకం చేస్తున్న ఆదిత్యారెడ్డి

పోరుమామిళ్ల: వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ యువనేత దేవసాని ఆదిత్యారెడ్డి అయ్యప్ప మాల ధరించిన సందర్భాన్ని పురస్కరించుకొని వారి ఇంట్లో పడిపూజ నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో వారి కుటుంబసభ్యులు, అయ్యప్ప మాలధారులు పాల్గొన్నారు. అయ్యప్ప పంచలోహ విగ్రహానికి అభిషేకం నిర్వహించి, అయ్యప్ప శరణాలు ఆలపించారు. అయ్యప్ప భక్తులకు అన్నదానం చేశారు.

ఆటపాటలతో అంగన్‌వాడీ విద్య

కాశినాయన : ఆటపాటలతో అంగన్‌వాడీ విద్యను నేర్పిస్తున్నామని అంగన్‌వాడీ కార్యకర్త తులసమ్మ అన్నారు. గురువారం ఆకులనారాయణపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు. తల్లులు కూడా పిల్లలు ఇంటికి వచ్చిన తర్వాత వారితో పాటలు పాడించాలని తెలిపారు. అనంతరం గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ రాములమ్మ, ఆయా సుబ్బలక్షుమ్మ పాల్గొన్నారు.

ప్రయాణం దుర్లభం



అట్లూరు పునరావాస కాలనీ సమీపంలో కడప-బద్వేలు ప్రధాన రహదారిపై నిలిచి నీరు

అట్లూరు: కొద్దిపాటి వర్షం కురిస్తే చాలు.. అట్లూరు క్రాస్ రోడ్డు సమీపంలోని పునరావాస కాలనీ మధ్యలో ఉన్న కడప -బద్వేలు ప్రధాన రహదారిపై ప్రయాణం దుర్లభంగా మారుతున్నది. రోడ్డుపై నీరు నిలిచి చెరువును తలపిస్తోంది. దీంతో ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఎర్రచందనం చెట్ల పెంపకంతో రైతులకు లాభం

ఖాజీపేట : రైతులు పొలాల్లో ఎర్రచందనం, శ్రీగంధం, వీరగన్నేరు చెట్లను అధికారికంగా పెంచుకోవచ్చునని, ప్రభుత్వం అనుమతులు ఇస్తుందని ఫారెస్ట్ అధికారి సతీష్ రైతులకు సూచించారు. పత్తూరు గ్రామంలో అడవి చెట్ల పెంపకంపై రైతులకు అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పంటలతో పాటు చెట్లను కూడా పెంచుకోవచ్చునని అన్నారు. ఎంతో లాభం వస్తుందని పేర్కొన్నారు. ఆసక్తి కల్గిన రైతులకు మొక్కలు పంపిణీ చేస్తామని తెలిపారు. వ్యవసాయాధికారి నాగార్జున, రైతులు పాల్గొన్నారు.

సిరుల పంట

- విస్తారంగా ఉద్యాన పంటల సాగు
- లభిస్తున్న గిట్టుబాటు ధర
- 2,732 ఎకరాల్లో అరటి సాగు

కాశినాయన : అన్నదాతకు పంటలు ఉద్యాన పంటలు సిరులు కురిపిస్తున్నాయి. 15 సంవత్సరాలుగా మండలంలో ఉద్యాన పంటలపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. మొదట 50 ఎకరాల్లో సాగైన అరటిపంట ఇప్పుడు 2,732 ఎకరాల్లో రైతులు సాగు మార్కెట్‌లో ధరలు స్థిరంగా ఉండటంతో సాగు విస్తీర్ణంపై రైతుల్లో ఆసక్తి పెరిగింది. ఈ ఏడాది అరటి పంటకు రైతులు ఆశించిన స్థాయిలో ధర లభించింది. మండలంలో ఎక్కువగా ఉద్యాన పంటలను వరికుంట్ల, నాయునిపల్లె, ఆకులనారాయణపల్లె, సావిశెట్టిపల్లె, ఇటుగుల్లపాడు, పగడాలపల్లె, పాలగిరి, కోడిగుడ్లపాడు, కె.ఎస్.కొట్టాల, కొండ్రాజుపల్లె గ్రామాల్లో సాగు చేస్తున్నారు. ఉద్యాన పంటలను ఒకసారి సాగు చేస్తే పంట రకాలను బట్టి మూడు సంవత్సరాల నుంచి 30 సంవత్సరాల వరకు పంట దిగుబడి వస్తుంది.



కాశినాయన మండలంలో సాగు చేసిన అరటి తోట

ఎకరాకు సాగు ఖర్చు

ఎకరా అరటి పంటను సాగు చేయాలంటే రూ.16 వేలు మొక్కలకు, సేద్యాలకు రూ.15 వేలు, రసాయనిక ఎరువులు, డ్రిప్ మందులకు రూ.45 వేలు, పురుగు మందులకు రూ.5 వేలు, కూలీ ఖర్చులకు రూ.10 వేలు కలిపి దాదాపు రూ.లక్ష ఖర్చు వస్తుంది. సక్రమంగా అన్నీ అనుకూలిస్తే ఎకరాకు 12 టన్నుల నుంచి 16 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. ధర ఆశాజనకంగా ఉంటే రూ.2 లక్షల వరకు ఆదాయం వస్తుంది. పెట్టుబడి పోను రూ.లక్ష ఆదాయం వస్తుండటంతో ఆసక్తి చూపుతున్నారు.

2,075 ఎకరాల్లో సాగు

మండలంలో ఆయిల్‌పామ్ 354 ఎకరాలు, మామిడి 311 ఎకరాలు, నిమ్మ 297 ఎకరాలు, జామ 285 ఎకరాలు, కొబ్బరి 275, తమలపాకు 120, రోజా పూల తోటలు 112, దానిమ్మ 104, రేగు 61, సీతాఫలం 52, అంజూర 48, నన్నారి 39, సపోట 15, డ్రాగన్‌ఫ్రూట్ 13, నేరేడు 11 ఎకరాల్లో సాగు చేస్తున్నారు.

గిట్టుబాటు ధర కల్పించాలి



ఎన్నో ఒడిదుడుకులు, అవస్థలు పడి అరటి, ఉద్యాన పంటలను పండిస్తున్నాం. సాధారణంగా తోటలు కాపుకు వచ్చిన సమయంలో అరటి పంటకు గిట్టుబాటు ధర తక్కువగా ఉంటుంది. ఉద్యాన పంటలకు గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వమే కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలి.

–శేషారెడ్డి, రైతు, ఆకులనారాయణపల్లె, కాశినాయన మండలం

సూచనలు పాటించాలి



ఉద్యాన పంటలు సాగు చేసే రైతులు ఉద్యాన అధికారుల సూచనలు పాటించాలి. ఏ సమయంలో ఏ మోతాదులో మందులు వాడాలో అవగాహన కలిగి ఉండాలి. పంటలకు తెగుళ్ల సోకినప్పుడు మమ్మల్ని సంప్రదించాలి.

–శ్రీనివాసరెడ్డి, ఉద్యాన అధికారి, కాశినాయన మండలం

పిల్లల ఆరోగ్యమే దేశ సౌభాగ్యం



వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ నాగరాజు

ప్రొద్దుటూరు క్రైం : పిల్లల ఆరోగ్యమే దేశ సౌభాగ్యమని, పిల్లలందరికి ఆరోగ్య పరీక్షలు చేయించాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ నాగరాజు సూచించారు. మండలంలోని తాళ్లమాపురం, బొల్లవరం, లింగారెడ్డికొట్టాల, ఎస్ఎస్‌వీహైస్కూల్, అమృత గార్డన్స్, రాజుపాళెం మండలం కొర్రపాడులో ఎన్‌సీడీసీడీ, క్యాన్సర్, చైల్డ్ హెల్త్ స్క్రీనింగ్ సర్వేలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ 18 ఏళ్ల పైబడిన వారందరికి రక్తపోటు (బీపీ), మధుమేహం (షుగర్), నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ వ్యాధులకు వైద్య ఆరోగ్య సిబ్బంది స్క్రీనింగ్ పరీక్షలు చేస్తారన్నారు. ముందస్తు పరీక్షలు చేయించుకోవడం వలన వ్యాధిని గుర్తించి తగిన చికిత్స తీసుకోవచ్చని పేర్కొన్నారు. ప్రస్తుతం ఎక్కువగా బీపీ, షుగర్, క్యాన్సర్ వ్యాధులు వస్తున్నాయని, వాటి వలన అనారోగ్యానికి గురవుతున్నారని తెలిపారు. రాష్ట్రీయ బాల ఆరోగ్య కార్యక్రమంలో ప్రతి శనివారం అంగన్‌వాడీ కేంద్రాల్లో 6 నెలలు మొదలుకొని 5 ఏళ్ల వరకు పుట్టుకతో వచ్చే లోపాలను, ప్రతి గురువారం పాఠశాలలో ఒకటో తరగతి నుంచి 5వ తరగతి వరకు పిల్లల్లో బాల్యంలో వచ్చే వ్యాధులను, 6 నుంచి 10వ తరగతి వరకు చదివే పిల్లల్లో కౌమార ఆరోగ్యం గురించి స్క్రీనింగ్ పరీక్షలు చేస్తారని తెలిపారు. ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రమేష్, డాక్టర్ శివప్రసాద్ రెడ్డి, డాక్టర్ భరత్ నారాయణ, డాక్టర్ హిమబిందు, డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ నిఖిల, ఎపిడమాలజిస్ట్ ఖాజా మొహిద్దీన్, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రసాయనాల వాడకంతో అనర్థం

చాపాడు: సాగులో రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు విచ్చలవిడిగా వాడడం వలన ప్రకృతిలోని జీవరాశుల మధ్య సమతుల్యత లోపించి నేలలో ఉండే సారవంతమైన సూక్ష్మజీవులు చనిపోతున్నాయని జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరావు పేర్కొన్నారు. మండలంలోని లక్ష్మీపేటలో మండల వ్యవసాయ అధికారి మ్యాగీ ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ నేలల దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జేడీఏ మాట్లాడుతూ రసాయన ఎరువులు, క్రిమీ సంహారక మందుల వినియోగం వలన సూక్ష్మజీవులు, వానపాము, నత్త, పీతలు వంటి జీవరాశులు నశిస్తున్నాయన్నారు. రైతులు మృత్తికా పరిరక్షణ మీద అవగాహనతో రసాయన ఎరువులు, మందుల వినియోగం తగ్గించి సేంద్రియ, ప్రకృతి వ్యవసాయ పద్ధతులు ఆచరించడం మేలని సూచించారు. ఏడీఏ కృష్ణమూర్తి, టెక్నికల్ ఏఓ లక్ష్మణ్ పాల్గొన్నారు.

నేలవాలిన ఆశలు!



బి.కోడూరు : అయ్యవారిపల్లెలో నీటమునిగిన వరిపంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి



రాజుపాళెం: కొట్టాల గ్రామంలో దెబ్బతిన్న వరిపంటను పరిశీలిస్తున్న ఏఓ, రైతులు

రాజుపాళెం : చినుకు వణికిస్తోంది.. అన్నదాతలో ఆందోళన మొదలైంది.. ఫెంగల్ తుపాను అన్నదాతకు కంటిమీద కునుకు లేకుండా చేస్తుంది. తుపాన్ కారణంగా వాతావరణ మార్పులతో పంటను రక్షించుకునేందుకు రైతులు నానా తంటాలు పడుతున్నారు. వర్షానికి చేతికొచ్చిన పంటలు నేలవాలడంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. గురువారం అర్ధరాత్రి వర్షం పడటంతో మండలంలోని పలు గ్రామాల్లో రైతులు సాగు చేసిన వరి పంట నేలవాలింది. అలాగే కోతకు వచ్చిన మినుము, పెసర పంటలకు మరింత నష్టాన్ని చవిచూడాల్సి వస్తోందని అంటున్నారు. అలాగే కల్లాల్లో ఆరబోసుకున్న వరి ధాన్యం తడిసి పోవడంతో రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తడిసిన ధాన్యాన్ని వ్యాపారులు కొనుగోలు చేసేందుకు ముందుకు రాకపోవడంతో విలపిస్తున్నారు.

ఉన్నతాధికారులకు నివేదిక

ఫెంగల్ తుపాన్ ప్రభావంతో దెబ్బతిన్న వరి పంట నష్టాన్ని ఉన్నతాధికారులకు నివేదిక పంపినట్లు మండల వ్యవసాయాధికారి శివరామకృష్ణారెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం మండలంలోని కొట్టాల గ్రామంలో వర్షానికి దెబ్బతిన్న వరిపంటను రైతులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ మండలంలో 711 ఎకరాల్లో పంట పూర్తిగా దెబ్బతిన్నట్లు నివేదికలు పంపామని చెప్పారు.

అల్లాడుతున్న రైతులు

చాపాడు: వారం రోజులుగా కురుస్తున్న ఫెంగల్ తుపాను వలన రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పంటను కాపాడుకునేందుకు నానా అవస్థలు పడుతున్నారు, బుధ, గురువారాల్లో కురిసిన 47.4 మిల్లీ మీటర్ల భారీ వర్షం వలన ఆరబెట్టుకున్న ధాన్యం తడవగా, పొలాల్లో చేతికంది వరి పైర్లు పడిపోవడంతో కాపాడుకునేందుకు విలవిలాడిపోతున్నారు.

నష్టాన్ని మిగిల్చిన తుపాను

బి.కోడూరు : మండలంలో ఫెంగల్ తుపాను భారీ నష్టాన్ని మిగిల్చింది. మేకవారిపల్లె, అయ్యవారిపల్లె, అనుమోరుపల్లె, అంకనగొడుగునూరు, నరసయ్యకొట్టాలు, ప్రభలవీడు, మాధవరాయునిపల్లె తదితర గ్రామాల్లో వరిపంట కోత దశలో ఉండటంతో వర్షానికి కారణంగా నేలవాలిపోయింది. తడిసిన ధాన్యానికి గిట్టుబాటు ధర లేకపోవడంతో పాటు కొనుగోలు చేసేవారు కరువవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు.

పంటలను పరిశీలించిన వ్యవసాయాధికారి

మండలంలో ఫెంగల్ తుపానుకు దెబ్బతిన్న వరి, మినుము తదితర పంటలను గురువారం మండల వ్యవసాయాధికారి కౌశిక పరిశీలించారు. పంట నష్టంపై నివేదికను అధికారులకు పంపామని తెలిపారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన

ప్రొద్దుటూరు రూరల్ : వర్షానికి దెబ్బతిన్న పంటలను గురువారం ఏడీఏ సురేష్‌రెడ్డి, ఏఓ శివశంకర్‌రెడ్డి పరిశీలించారు. కామనూరు, చెన్నమరాజుపల్లె గ్రామాల పరిధిలో సుమారు 350 ఎకరాల్లో వర్షానికి వరి పంట నేలమట్టమైందని వారు తెలిపారు. ఈ వర్షం ఇంతటితో ఆగితే రైతులకు అంతగా నష్టం ఉండదని, రెండు మూడు రోజుల్లో నూర్పిళ్లు జరుపుకోవచ్చన్నారు. మళ్లీ వర్షం కొనసాగితే మొసులు రాకుండా ఉప్పు ద్రావణాన్ని పిచికారి చేసుకోవాలని సూచించారు.

పంట నష్టం నమోదు

ఖాజీపేట : మండలంలో వర్షాలకు దెబ్బతిన్న పంటలను వ్యవసాయాధికారి నాగార్జున, సిబ్బందితో కలిసి పంటలను పరిశీలించారు. 612 ఎకరాల్లో నష్టం జరిగినట్లు అధికారులు అంచనా వేశారు. పంట నష్టం వివరాలు, రైతుల పేర్లను నమోదు చేసి ఉన్నతాధికారులకు నివేదికలు పంపిస్తున్నట్లు వ్యవసాయాధికారి తెలిపారు.

ఉపాధ్యాయుడిని హత్య చేయడం దారుణం



కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యా బుద్ధులు నేర్పే ఉపాధ్యాయుడు ఎజాజ్ అహ్మద్ హత్య చేయడం దారుణమని ఎస్ఎల్‌టీఏ రాష్ట్ర అధ్యక్షుడు అంకాల్ కొండయ్య పేర్కొన్నారు. గురువారం సాయంత్రం రాయచోటిలో ఉపాధ్యాయుడు ఎజాజ్ అహ్మద్ హత్యకు నిరసనగా గాంధీ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో గాంధీ రోడ్డులోని గాంధీ విగ్రహం నుంచి టీబీ రోడ్డులో వైఎంఆర్ కాలనీ పాణ్యం ఎర్రమునిరెడ్డి విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులపై విద్యార్థులే దాడి చేయడం దారుణమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎల్‌టీఏ నాయకులు గంగాధర్, సాయికుమార్, జింకా శేఖర్, ప్రసాద్, సుందరం, రోషన్, షరీఫ్, పాములేటి, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి హత్యపై విచారణ జరిపించాలి

మైదుకూరు : రాయచోటిలోని కొత్తపల్లె హైస్కూల్‌లో ఉపాధ్యాయుడు ఎజాజ్ అహ్మద్ మృతిపై విచారణ జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలని యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు వై.రవికుమార్ డిమాండ్ చేశారు. ఏపీ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) జిల్లా శాఖ పిలుపు మేరకు గురువారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో మండలంలోని వనిపెంట హైస్కూల్‌లో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి రాయచోటి సంఘటనపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రవి కుమార్ మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా రాయచోటిలోని కొత్తపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న ఎజాజ్ అహ్మద్‌పై ఆ పాఠశాలలోని ఉన్మాదులైన కొందరు విద్యార్థులు అత్యంత పాశవికంగా దాడి చేయడం యావత్ ఉపాధ్యాయ లోకాన్ని దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. విద్యావేత్తలు మేధావులు, ఎమ్మెల్సీలు, ఉపాధ్యాయ సంఘ నాయకులతో చర్చించి విద్యాహక్కు చట్టంలో ప్రభుత్వం అనేక మార్పులు తీసుకొని రావాలని పేర్కొన్నారు. ఉపాధ్యాయులకు రక్షణగా చట్టాలు తేవాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్, గురివిరెడ్డి, ఉపాధ్యాయులు మొహిద్దీన్‌ఖాన్, సుధాకర్ బాబు, శ్యామలాదేవి, సంజమ్మ, మునీర్ అహ్మద్, మహమ్మద్‌బాషా, నరసింహా మూర్తి, సురేష్, జబ్బార్ పాల్గొన్నారు.

- రాయచోటి సంఘటనపై మైదుకూరులోని ఉర్దూ హైస్కూల్‌లో ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. ఉపాధ్యాయుడు ఎజాజ్ అహ్మద్‌పై దాడి చేసి ఆయన మృతికి కారణమైన విద్యార్థులను కఠినంగా శిక్షించాలని వారు కోరారు. ఎజాజ్ అహ్మద్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

కఠినంగా శిక్షించాలి

ఖాజీపేట : రాయచోటిలోని కొత్తపల్లె హైస్కూల్‌లో ఉపాధ్యాయుడు ఎజాజ్ అహ్మద్‌పై దాడి చేసి ఆయన మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని ఉపాధ్యాయులు కోరారు. బాలికల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ సంఘాల నేతలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇజాజ్ అమ్మద్ మృతి బాధాకరం అన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుబ్బారెడ్డి, మల్లికార్జున, ఓబన్న, వెంకటరామిరెడ్డి, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల: కొత్తపల్లె ఉర్దూ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ఎజాజ్ అహ్మద్ మృతిపై గురువారం ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. ఫ్యాప్టో నాయకులు మాట్లాడుతూ ఈ దారుణానికి వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. ఉపాధ్యాయుడి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంఈఓ కాశయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు పుల్లయ్య, శ్రీనివాసులు, వెంకట్రామిరెడ్డి, చంద్రహాసరెడ్డి, సత్తార్, అబ్దుల్‌హుసేన్, వారణాసి రవి, సురేంద్రనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిపై దాడి అమానుషం

అట్లూరు : అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణం కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉర్దూ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ఎస్.ఎజాస్‌అహ్మద్ మృతికి కారణమైన వారిని శిక్షించాలని బద్వేలు జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.వెంకటసుబ్బారెడ్డి పేర్కొన్నారు. ఉపాధ్యాయుడిపై దాడిని నిరసిస్తూ ఫ్యాప్టో పిలుపు మేరకు గురువారం బద్వేలు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు.

ఘనంగా అంతర్జాతీయ స్వచ్ఛంద సేవకుల దినోత్సవం



స్వచ్ఛంద సేవకులను సన్మానిస్తున్న నిర్వాహకులు

పోరుమామిళ్ల: అంతర్జాతీయ స్వచ్ఛంద సేవకుల దినోత్సవాన్ని గురువారం పోరుమామిళ్లలో మదర్ థెరిసా ఫౌండేషన్ ఆధ్వర్యంలో బ్లెస్డ్ బ్రెయాన్ అనాథాశ్రమ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ చిత్తా విజయప్రతాప్‌రెడ్డి, ఫౌండేషన్ వ్యవస్థాపకులు చిత్తా రవిప్రకాష్‌రెడ్డి, మేనేజింగ్ ట్రస్టీ గిరిప్రణీత్‌రెడి మదర్ థెరెసా విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. సేవలందిస్తున్న 100 మందిని సన్మానించారు. జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, ప్రజ్వలారెడ్డి, డాక్టర్ అమితారెడ్డి పాల్గొన్నారు.

ప్రతాప్‌రెడ్డికి మదర్‌థెరిసా అవార్డు



అవార్డు అందుకున్న అంబవరం ప్రతాప్‌రెడ్డి

అట్లూరు: బద్వేలుకు చెందిన డాక్టర్ అంబవరం ప్రతాప్‌రెడ్డికి అంతర్జాతీయ స్వచ్ఛంద సేవకుల దినోత్సవం సందర్భంగా మదర్‌థెరిసా సేవారత్న అవార్డు అందుకున్నారు. పోరుమామిళ్లలో మదర్‌థెరిసా ఫౌండేషన్ వారు గురువారం ప్రపంచ స్వచ్ఛంద సేవాసంస్థల సేవకుల దినోత్సవం నిర్వహించారు. ఈ వేడుకల్లో ప్రతాప్‌రెడ్డికి ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ చిత్తా విజయప్రతాప్‌రెడ్డి మదర్ థెరిసా సేవారత్న అవార్డు అందజేశారు.

సేవారత్న అవార్డు ప్రదానం

ప్రొద్దుటూరు కల్చరల్ : పట్టణానికి చెందిన ఆదరణ స్వచ్ఛంద సేవాసంస్థ అధ్యక్షుడు బైసాని సత్యనారాయణకు మదర్‌థెరిసా సేవా రత్న అవార్డు అందించి సత్కరించారు. పోరుమామిళ్లలో మదర్‌థెరిసా ఫౌండేషన్ వారు గురువారం అంతర్జాతీయ స్వచ్ఛంద సేవాసంస్థల సేవకుల దినోత్సవం నిర్వహించారు.

బి.కోడూరు : మేకవారిపల్లె గ్రామానికి చెందిన ఎస్ఆర్‌హెచ్ఆర్‌సీ సభ్యులు తిరుపతిరెడ్డికి మదర్‌థెరిసా ట్రస్ట్ సభ్యులు రవిప్రకాష్‌రెడ్డి, విజయప్రతాప్ రెడ్డి, గిరిప్రణీత్‌రెడ్డి మదర్‌థెరిసా సేవారత్న పురస్కారం అందజేశారు.

నేడు ప్రొద్దుటూరులో జాబ్‌మేళా

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లా ఉపాధి కార్యాలయం, నైపుణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రొద్దుటూరులోని హౌసింగ్‌బోర్డు కాలనీలోగల వెలుగు కార్యాలయంలో ఉదయం 10 గంటలకు జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌బీఐ కార్స్, ఎల్ఎంఎస్ కార్పొరేట్ సర్వీస్ ప్రైవేటు లిమిటెడ్, ఎయిర్‌టెక్ పేమెంట్ బ్యాంకులలో ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామన్నారు. టెన్త్, ఇంటర్, డిప్లొమా (అగ్రికల్చర్), ఏదైనా డిగ్రీ, పీజీ ఉత్తీర్ణులై 19–32 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన ఇందుకు అర్హులన్నారు. ఎంపికైన వారికి రూ. 16–21 వేల వరకు హోదాను బట్టి వేతనం ఉంటుందన్నారు. ఆసక్తిగల నిరుద్యోగులు విద్యార్హతల ధృవపత్రాలు, ఫోటోలతో ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు.

ప్రభుత్వం రైతాంగాన్ని ఆదుకోవాలి

పోరుమామిళ్ల: అకాల వర్షాలకు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ మండల ఏరియా కార్యదర్శి పిడుగు మస్తాన్, మండల కార్యదర్శి రవి కోరారు. గురువారం వారు మాట్లాడుతూ కలసపాడు, కాశినాయన, పోరుమామిళ్ల, అట్లూరు మండలాల్లో పంట నష్టపోయిన రైతుల వివరాలు సేకరించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు.

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

ప్రొద్దుటూరు రూరల్ : మండలంలోని భూ సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం నుంచి జనవరి 7వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ గంగయ్య ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కామనూరు గ్రామంలోని గ్రామ సచివాలయంలో, ఈనెల 9న దొరసానిపల్లెలో, 10న ఉప్పరపల్లెలో, 11న చౌడూరులో, 12న ప్రొద్దుటూరులోని హరిజనవాడ 1 గ్రామ సచివాలయంలో, 13న గోపవరంలో, 17న కొత్తపల్లెలో, 18న కల్లూరులో, 19న సర్విరెడ్డిపల్లెలో, 20న నంగనూరుపల్లెలో, 21న పెద్దశెట్టిపల్లెలో, 26న బొల్లవరంలో, 27న తాళ్లమాపురంలో, 28న రేగుళ్లపల్లెలో, 31న ఎర్రగుంట్లపల్లెలో, జనవరి 2న మోడంపల్లెలోని కొత్తపల్లె-2 గ్రామ సచివాలయంలో, 3న రామేశ్వరంలోని ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయంలో, 4న రంగసాయిపురంలో రామాలయ దేవాలయంలో, 7న ప్రొద్దుటూరు అర్బన్ పరిధిలోని పాతమార్కెట్‌లోని గ్రామ చావిడి వద్ద ఈ రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి

ఖాజీపేట : రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ మహబూబ్ బాషా సూచించారు. 6వ తేదీన కొమ్మలూరు, 7న త్రిపురవరం, 10న ఏటూరు, 11న తవ్వారిపల్లె, 12న బి.కొత్తపల్లె, భూమాయపల్లె, 13న ఖాజీపేట, 17న పత్తూరు, 18న పుల్లూరు, 19న అప్పనపల్లె, 20 రావులపల్లె, 24 దుంపలగట్టు, 26 చెన్నముక్కపల్లె, 27 తుడుమలదిన్నె, 28 మిడుతూరు, 31 చెన్నముక్కపల్లె, సీ.కొత్తపేట, జనవరి 2న బుడ్డాయపల్లెలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మైదుకూరు : మైదుకూరు మున్సిపాలిటీ మండలంలో శుక్రవారం నుంచి జనవరి 8వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రాజసింహ నరేంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సచివాలయ పరిధిలో రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తామని, ప్రజలు సమస్యలపై అర్జీలు ఇవ్వాలని పేర్కొన్నారు.

నేడు లక్ష్మీపేటలో గ్రామ రెవెన్యూ సదస్సు

చాపాడు: మండల పరిధిలోని లక్ష్మీపేట గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం గ్రామ రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు రమాకుమారి తెలిపారు. కేతవరం రెవెన్యూ గ్రామ పరిధిలోని కేతవరం, లక్ష్మీపేట, వీరభద్రాపురం గ్రామాలకు చెందిన రైతులు భూ సమస్యలపై అధికారులకు ఫిర్యాదు చేయవచ్చని కోరారు.

కాశినాయన : మండల వ్యాప్తంగా నేటి నుంచి జనవరి 8వ తేదీ వరకు గ్రామ రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దారు వెంకటసుబ్బయ్య గురువారం తెలిపారు. 6న రంపాడు, 9న ఉప్పలూరు, 10న మూలపల్లె, 11న బాలాయపల్లె, 12న వరికుంట్ల, 13న నాయునిపల్లె, 17న వాసుదేవాపురం, 18న చెన్నవరం, 19న కోడిగుడ్లపాడు, 20న పగడాలపల్లె, 21న ఓబుళాపురం, 24న పిట్టిగుంట్ల, 26న నరసాపురం, 27న గంగనపల్లె, 28న గొంటువారిపల్లె, 31న వెంగలంపల్లె, వచ్చే ఏడాది జనవరి 2న వంకమర్రి, 3న అక్కంపేట, 4న ఇటుగుల్లపాడు, 7న అక్కంపేట, 8వ తేదీన సావిశెట్టిపల్లె గ్రామాల్లో గ్రామ రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామన్నారు. రైతులు భూ సమస్యలను ఈ సదస్సుల్లో పరిష్కరించుకోవాలని కోరారు.